# పొగొన్న మిగిలేవాళ్ళు



దుః ఖమైనా, సంతోషమైనా ఎక్కువైతే, కన్నీళ్ళు వస్తాయి. అలా కన్నీళ్ళు వచ్చినప్పుడల్లా అమ్మ గుర్తుకొస్తుంది అజితకి. ఆర్నెల్ల క్రితం పెళ్ళయ్యేంతవరకూ ఇరవైమూడేళ్ళు అమ్మతోనే గడిచిపోయింది అజిత జీవితం.

అమ్మే తనకి- తండ్రీ, తల్లీ, అక్కా, చెల్లీ. స్కూల్లోనూ, కాలేజీలోనూ ఎంతమంది స్నేహితులున్నా, వాళ్ళందరికన్నా ఎక్కువగా తనకి స్నేహితురాలిగావున్నది అమ్మే. అమ్మలాగా తను తనకి పుట్టబోయేవాళ్ళతో వుండాలని అనుకుంది.

తనకి పుట్టబోయేవాళ్ళతో అనుకోగానే- పుట్టబోయేది పిల్లో, పిల్లాడో... ఎలా వుంటుందో, వుంటాడో అన్న ఆలోచన వచ్చింది అజితకి.

ఆ ఆలోచనల్లోవుండగా... భర్తవచ్చాడు. భర్తతోపాటు ఆడపడుచూ వచ్చింది. వాళ్ళిద్దరినీ చూడగానే పక్కగదిలోంచి అత్తగారు వచ్చింది.

ఆడపడుచు అజిత దగ్గరగా వచ్చి- "ఎలా వున్నావు అజితా?" అని అడిగింది.

"బానే వున్నాను" అని అజిత అంటుండగానే, "ఇంకా ఐదునెల్లుకూడా నిండలేదు. కానీ బాగా నీరసంగా కనిపిస్తోందికదూ- అప్పటికీ ఇంటి పనంతా నేనే చేస్తున్నా" అంది అత్తగారు.

"అది సరే-డాక్టర్‌కి చూపిస్తున్నారు కదా?" అని అడిగింది ఆడపడుచు అజితని.

"నా ఫ్రెండ్ మాధవే చూస్తోంది. అంతా బాగానే వుందని చెప్పింది" అంది అజిత.

"స్కానింగ్‌చేయించిందా?" అంది ఆడపడుచు.


"ఇప్పుడే అవసరం లేదంది. ఇంకో నెల ఆగాక చేయిస్తే చాలంది" చెప్పింది అజిత.

"వాళ్ళలానే చెప్తారు. మనం మన జాగ్రత్తలో వుండాలి. స్కానింగ్ సెంటర్ దగ్గర్లోనే వుందిగా. వెళ్దాంపద" అంటూ లేవదీసింది ఆడపడుచు.

ఏమిటన్నట్లు భర్తవంక చూసింది అజిత.

"అంతగా చెప్తోందిగా, చేయించుకుందువుగానీ" అన్నాడు భర్త. ఆ మాటకు-

"మాధవి చూస్తోందిగా. అవసరమైతే తనే చెప్తుందిగా. అంతగా వెళ్దామంటే తననీ అడిగి వెళ్దాం" అని సెల్‌ఫోన్ తియ్యబోయింది అజిత.




"మనం చేయించేది స్కానింగ్. ఎవరినీ అడగనక్కర్లేదు" అంది ఆడపడుచు.

"అదంత అక్కరగా అడుగుతోంటే రానం టావేంటి- నీకోసమేగా చెప్తోంది" అంది అత్త గారు. తప్పదన్నట్లు బయల్దేరింది అజిత. భర్త స్కూటర్‌మీద వస్తోంటే...అజితా, అత్త గారూ, ఆడపడుచూ ఆటో ఎక్కారు.

తనకి స్కానింగ్ చేస్తారని అనుకుంటుంటే "స్కానింగప్పుడు నువ్వు నీ పుట్టబోయే బుజ్జా యిని తెరమీద చూసుకోవచ్చు" అన్న మాధవి మాటలు గుర్తొచ్చాయి. తన కడుపులో నాలుగు నెలలుగా పెరుగుతున్న చిన్నారి రూపం ఎలా కనిపి స్తుందో అని ఊహించుకోసాగింది.

స్కానింగ్ సెంటర్‌లో అల్ట్రాసోనోగ్రఫీ చేసే గది

## అనామకుడు

**●మనిషి దేనికీ బానిస కాకూడదు. అన్నింటికీ దూరంగా ఉంటూ సాధన చేయాలి.**

లోకి వెళ్ళింది అజిత.అజితతోపాటు వెళ్ళాడు భర్త. తన కడుపులోపలి భాగం తెరమీద కనిపిస్తోంది. అయితే అంతా గజిబిజిగా వుంది.

సోనోగ్రఫీ చేస్తున్నతను మధ్య మధ్యలో బొమ్మని ఆపుతున్నాడు. ఆపి "అదిగో తల" అనీ "అదిగో కాళ్ళు" అని చెప్తున్నాడు.

ఇంకా పూర్తిగా స్వరూపం రాని రూపాన్ని అజిత ఆనందంగా చూస్తోంది. భర్త కుతూహలంతో చూస్తున్నాడు. చెయ్యడం అయిపోగానే-

"అంతా బావుంది. కొంచెంసేపు కూచుంటే రిపోర్ట్ ఇచ్చేస్తాం" అన్నాడు చేసే అతను.

"థ్యాంక్స్" అంటూ లేచింది అజిత.

అంతవరకూ వున్న కుతూహలాన్ని చంపుకోలేనట్లు భర్త- "ఎవరు" అని అడిగాడు.

"మేం చెప్పం- అయినా డాక్టర్ గారిని అడిగి చూడండి" అన్నాడతను.

"రిపోర్ట్‌లో రాస్తారా?" అడిగింది రజిత.

"ఫీటస్ పరిస్థితి ఎలాగుందో రాస్తాం. అంతే. ఆడో మగో రాయం. రాయకూడదు. ఆ పరీక్షని నిషేధించారు కదా?" అన్నాడతను.

"మీకు తెలుస్తుందికదా?" అన్నాడు భర్త.

"అయినా చెప్పం" అన్నాడతను.

అజితకి కూడా తెలుసుకోవాలన్న కుతూహలం వుంది కానీ, అలా చెప్పనంటున్న అతని నిజాయితీకి ఆనందంగా కూడా వుంది. పుట్టబోయేది ఆడో మగో తెలుసుకుని ఆడైతే అబార్షన్ చేయించేసుకుంటున్నారు చాలామంది.

ఆడో మగో చెప్పని ఈ స్కానింగ్ సెంటర్ మంచిదే అని అనుకుంటూ భర్తని కదలమంటూ తను బయటికి నడిచింది. అలా నడుస్తూండగా, సోనోగ్రఫీ తీసిన అతను ఇంటర్‌కమ్‌లో నెమ్మదిగా 'బాయ్' అని అనడం వినిపించింది.

అతను ఎవరినన్నా బాయ్‌ని పిలుస్తున్నాడో లేక అవతల ఎవరితోనో బాయ్ అని చెబుతున్నాడో తెలియలేదు అజితకి. కానీ ఎందుకో రెండోదే అయ్యుంటుంది అని అనిపించింది. అంటే తనకి అబ్బాయన్నమాట. సోనోగ్రాఫర్ బాయ్ అనడం భర్త విన్నట్లు లేదు.పక్కనున్న డాక్టర్ గదిలోకి వెళ్తున్నాడు. వెనకే వెళ్ళింది అజిత.

నలభైఏళ్ళు పైబడ్డావిడ డాక్టర్ సీట్లో కూచునుంది. ఆవిడని చూడగానే మాధవి గుర్తొచ్చింది అజితకి. మాధవి సన్నగా, తెల్లగా, అందంగా వుంటుంది. ఈవిడ లావుగా, నల్లగా, అదోలా వుంది. అయితే ఈవిడ వయస్సులో పెద్దది. అనుభవం వుండివుంటుంది. ఆవిడ ముందున్న కుర్చీల్లో ఒక పక్కన అత్తగారూ, మరోపక్క ఆడపడుచూ కూర్చుని ఆమెతో మాట్లాడుతున్నారు.

వాళ్ళమధ్యనున్న కుర్చీలో కూర్చుంది అజిత.

వాళ్ళ వెనక నిల్చున్నాడు భర్త.

"ఏం చేస్తావ్?" అని అడిగింది డాక్టర్.

అజితకి ఆవిడ ఏం అడుగుతోందో అర్థం అవలేదు. ఏంటన్నట్లు చూసింది.

"తీయించేసుకుంటావా?" అని అడిగింది ఆవిడ మళ్ళీ అజితను.

"ఏమిటి" అంది అజిత ఏమీ అర్థంకానట్లు.

"నీ కడుపులో వున్నది అమ్మాయిట. అందుకే కడుపు తీయించేసుకుంటావా అని అడుగుతోంది డాక్టరమ్మ" అంది ఆడపడుచు.

అలాంటి మాటలు కథల్లోనో, సినిమాల్లోనో కానీ నిజజీవితంలో వినలేదు అజిత. తన ఆడపడుచు నుండి- అదీ తన అత్తగారూ, తన భర్తా తనపక్కనే వుండగా అలాంటి మాటలు వినడం జుగుప్సగా అనిపించింది.తన ముఖంలో భావం అర్థమైందేమో, ఆడపడుచు అత్తగారివైపు చూసింది.

ఆవిడ ఎంతో సౌమ్యంగా అనునయిస్తున్నట్లు మొదలెట్టి- "అదెందుకు చెప్తోందో అర్థంచేసుకో... మీరు కనేదే ఒక్కరిని. ఆ ఒక్కరూ ఆడదైతే ఏం సుఖం చెప్పు. అందుకే తీయించేసుకో. ఇప్పుడైతే తీసెయ్యడం సులభం అంటోంది డాక్టరమ్మ. అనవ

**ప్రతి ఒక్కరూ మతసామరస్యానికి, సహజీవనానికి కృషి చేయాలి.**




సరంగా గొడవ చెయ్యక ఒప్పేసుకో'' అంటూ చివరికి ఆజ్ఞాపిస్తున్నట్లు గట్టిగా చెప్పింది.

అజిత భర్తవైపు చూసింది. అతను "అమ్మా, అక్కా చెప్పేది విందాం. వాళ్ళు పెద్దవాళ్ళు. వాళ్ళకి తెలిసినంత మనకు తెలియదు. డాక్టర్‌గారు కూడా ఇప్పుడు తీయించేసుకుంటే ఏమీ కష్టం వుండదంటున్నారు'' అన్నాడు. అజితకి ఎక్కడికో అగాధంలోకి పడిపోతున్నట్లనిపించింది. ఇలాంటి సన్నివేశాన్ని అజిత కలలోకూడా ఊహించలేదు.

అత్తగారూ, ఆడపడుచూ అంతగా చదువుకున్న వాళ్ళు కాదు. కాక పోయినా మరీ ఇంత మూర్ఖంగా వుంటారనుకోలేదు. భర్త మనస్సులో ఇంత ఘోరమైన ఆలోచనలు వుంటాయని అజిత అస్సలు అనుకోలేదు. ఆరు నెలల్లో అతను తనకి అసలు అర్థమే కాలేదని అర్థమైంది అజితకి.

"మీరంటున్నది ఏంటో తెల్సా...హత్య... భ్రూణ హత్య'' అంది ఇంకేం అనాలో తెలియక.

డాక్టర్ కల్పించుకుని- "భూమ్మీదికి వచ్చాక చంపేస్తే అది హత్య. నీ కడుపులో వున్నది మాంసం ముద్ద. దాన్ని తీసి బయటపడేస్తాం అంతే. దానికి హత్యలాంటి పేర్లు పెట్టకు. నీ మేలు కోరి చెప్తున్నా. నువ్వొప్పుకుంటే గుట్టుచప్పుడుకాకుండా పని పూర్తి చేసేస్తాను. ఇప్పుడు కాదనుకుని వెళ్ళిపోయి... ఆ తర్వాత నా దగ్గరకి వస్తే నేనేం చెయ్యలేను.

అప్పుడో ఆడపిల్లని కని, దాన్ని పెంచలేక, పెళ్ళి చెయ్యలేక...దాన్ని మానసికంగా చంపేస్తావు. అంతకన్నా ఇప్పుడు... ఇంకా ప్రాణం రాకముందే... తీసెయ్యడం నయం. ఇంక నీ ఇష్టం''

'ఇంతకుముందే తెరమీద చూసినప్పుడు చిన్ని కాళ్ళూ, పెద్ద తలకాయా కనిపించాయి. అలా కనిపించిన చిన్నారిని మాంసం ముద్ద అనడానికి నోరు ఎలా వచ్చిందో ఈ డాక్టర్‌కి'అని అనుకుంది అజిత. అసలు నోరుకాదు...మనసెలావచ్చిందో అన్న ఆలోచనరాగానే...ఆమె డాక్టర్‌లా కాక... మనిషిలా కూడా కాకుండా రాక్షసిలా కనిపించింది.

పుట్టబోయే పిల్లల్లో ఏవైనా అనారోగ్యాలు వున్నాయేమో అని పరీక్షించేందుకు ఉపయోగపడే అల్ట్రా సోనోగ్రఫీని, పుట్టేది పిల్లో, పిల్లాడో కనుక్కునేందుకు

**● చేసిన తప్పును సమర్థించుకుంటే అది రెండింతలవుతుంది.**

వాడ్డమే అన్యాయం అయితే- అంతకన్నా అన్యాయం... తల్లిదో, పిల్లదో ఆరోగ్యాన్ని చెప్పే ఎమ్.టీ.పీ.ని ఆడపిల్లల అబార్షన్‌కి వాడ్డం.

అజితకి ఆలోచించేకొద్దీ పిచ్చెక్కుతున్నట్లైంది. ఈ రాక్షసత్వానికి తను తలవంచకుండా బయటపడ్డం ఎలాగో తెలియదు. అసలిలాంటి పరిస్థితులు ఎదురవుతాయనే తెలియదు తనకి. వాటినుంచి రక్షించుకోవడం అస్సలు నేర్చుకోలేదు.

అమ్మ చదువు నేర్పింది. కొంత వంటకూడా నేర్పింది. అణకువగా పనులు చేసుకోడం నేర్పింది. ఇలాంటి పరిస్థితి వస్తే ఏంచెయ్యాలో నేర్పలేదు.తను ఆడపిల్ల కాకుండా మగపిల్లాడైతే ధైర్యంగా తనకి కావల్సింది చెయ్యగలిగేదేమో.

ఆలోచించి ఏదోకటి చెయ్యాలని అనుకుని-

"బాత్రూం ఎక్కడ?" అని అడిగింది.

డాక్టర్ చూపినవైపు వెళ్ళింది.బాత్రూంలోకి వెళ్ళగానే తన సెల్‌ఫోన్ తీసి మాధవికి వెంటనే ఈ స్కానింగ్ సెంటర్‌కి రమ్మని ఫోన్‌చేసింది. బయటకి వచ్చి భర్తతో... "నన్నో పది నిమిషాలు ఆలోచించుకోనివ్వండి" అంది.డాక్టర్ ఇంకో గది చూపించింది. అక్కడ కూర్చుని అజితని ఒప్పించడానికి ప్రయత్నం చెయ్యసాగారు ముగ్గురూ.

వాళ్ళలా ఏదో చెబుతుండగా వచ్చింది మాధవి. వస్తూనే-"అజితా...ఇక్కడకి ఎందుకు వచ్చావ్?" అని అడిగింది. జరిగిందంతా చెప్పింది అజిత. మాధవి వస్తుందని ఊహించని భర్తా, అత్తగారూ ఏంచెయ్యాలో తెలియక చూస్తున్నారు.

ఆడపడుచు "ఇది మా కుటుంబ విషయం. నువ్వు జోక్యం చేసుకోవద్దు" అంది మాధవితో.

"తను నన్ను చూస్తున్న డాక్టర్. నేను రమ్మంటేనే వచ్చింది. డాక్టర్‌కి ఇవ్వాల్సిన మర్యాదకూడా ఇవ్వడంలేదు మీరు" అంది అజిత కోపంగా.

దాంతో మాటా మాటా పెరిగాయి.

పక్కగది నుండి స్కానింగ్ సెంటర్ డాక్టర్ వచ్చింది "ఏంటి గొడవ" అంటూ.

"నేనూ అదే అడుగుతున్నా...ఏంటీ గొడవ?" అంది మాధవి ఆమెను నిలదీస్తూ.

"గొడవేంలేదు. అబార్షన్ కావాలంటున్నారు"

"ఎందుకు?"

"పుట్టబోయేది ఆడపిల్లని..."

"సోనోగ్రఫీ మీరు చేశారా?" అడిగింది మాధవి.

"మా సోనోగ్రాఫర్ చేశాడు" అంది ఆ డాక్టర్.

"చేసి అమ్మాయని చెప్పాడా?"

"అవును" అని అంటూండగా ఆ సోనోగ్రాఫరే వచ్చాడు. మాధవి అతనితో-

"ఈవిడకి స్కానింగ్ చేసింది మీరేనా? అమ్మాయని చెప్పారా?"అడిగింది.

అతను ఏం చెప్పాలో తెలియక చూస్తోంటే-

"రండి... మళ్ళీ చేద్దాం" అంది.

వెంటనే అతను... "అసలు నేను వాళ్ళకి ఏం చెప్పలేదు. కానీ స్కానింగ్‌లో అబ్బాయనే కనిపించింది" అన్నాడు తత్తరపడుతూ.


"అబ్బాయి అయితే మరి, మీ డాక్టర్ అమ్మాయని అంటున్నారే?" అంది మాధవి.

అతను ఏంచెప్పాలో తెలియనట్లు తలవంచుకున్నాడు. మాధవి డాక్టర్‌తో కోపంగా... "అసలు స్కానింగ్ సెంటర్‌లో పుట్టబోయేది ఎవరో పరీక్ష చేసి చెప్పడమే నేరం. పుట్టబోయేది మగపిల్లాడని తెలిసి కూడా అమ్మాయని చెప్పి అబార్షన్ చెయ్యడం ఎంత పాపమో తెలుస్తోందా మీకు?

అబార్షన్ కేసులు ఎక్కువ చేసుకోడం కోసం ఇలా అబద్ధాలు చెబుతున్నారు మీరు. ఈ విషయం నాకు కొన్నాళ్ళక్రితమే తెలిసింది. అందుకే అజిత ఇక్కడకి రమ్మనమని ఫోన్ చేస్తే... ఇలాంటిదేదో వుంటుందనే అనుకుని వెంటనే వచ్చేశాను. ఒక డాక్టరై వుండి ఇంత హీనంగా ఎలా ప్రవర్తిస్తున్నారో అర్థంకావడంలేదు నాకు" అంది.

"ఇలా అబద్ధం చెప్పడానికి ఎంత ధైర్యం?" అంది అజిత కోపంగా.

**సాహసం, ప్రయత్నం అనేవి మీ కష్టకాలంలో మిత్రులు.**




"ఇందులో ధైర్యానికి ఏముంది? వాళ్ళు పుట్టబోయేది ఆడో మగో రాసివ్వరు. ఎందుకంటే రూల్స్ అంటారు. నోటితో అమ్మాయని చెప్తారు. చెప్పిందానికి ఋజువేంలేకుండా. అది కూడా, ఎవరైతే అబార్షన్‌కి ఒప్పుకుంటారో వాళ్ళకే చెప్తారు" అంది మాధవి, అజితని, ఆడపడుచునీ చూస్తూ.

మాధవి తమని గురించే అంటోంది అన్న విషయాన్ని పట్టించుకోనట్లు- "అంటే అబార్షన్‌చేసి డబ్బు గుంజుకునేందుకు... పుట్టబోయేది అబ్బాయైతే అమ్మాయని చెప్పిందా ఈ డాక్టర్?" అని అత్తగారు అడుగుతోంటే...

"ఎంత దగానో... ఇలాంటి స్కానింగ్ సెంటర్లూ, ఇలాంటిడాక్టర్లూ వుంటారనుకోలేదు"అన్నాడు భర్త.

"సమయానికి తెలిసింది కాబట్టి సరిపోయింది కాని, ఇంత మోసమా?" అంది ఆడపడుచు.

"వాళ్ళు చేస్తున్నది మోసం. కరెక్టే. కానీ దానికి కారణం ఎవరు? మీలాంటివాళ్ళేకదా? అమ్మాయైతే అబార్షన్‌చేయించుకుందామని మీరు అనుకోవడంవల్లే కదా... వీళ్ళు ఇలా చెయ్యగలుగుతున్నారు" అని వాళ్ళతో అని, "ఏం చేస్తావ్?" అని అజితని అడిగింది మాధవి.

"ఇంక చెయ్యడానికి ఏముంది? పుట్టబోయేది మగపిల్లాడే కదా?" అంటున్న భర్తమాటలకి అడ్డొస్తూ అజిత అంది-

"పుట్టబోయేది ఎవరైనా ఒకటే. దాన్నిబట్టి నేను చేసేదేంలేదు. తను అడుగుతున్నది దాని గురించి కాదు.నేను ఇప్పుడేంచేస్తానూ అని.నేను అమ్మ దగ్గరకి వెళ్ళిపోతున్నాను-ఇక్కడినుండి ఇలానే".

ఆమె గొంతులో వున్న స్థిరత్వానికి- భర్తా, అత్తగారూ, ఆడపడుచూ...ఏంచెయ్యాలో, ఏంచెప్పాలో తెలియనట్లు బొమ్మల్లా వుండిపోయారు.

అజిత మాధవితో- "మాధవీ... నీకు థ్యాంక్స్ చెప్పాల్సిన అవసరంలేదని తెలుసు నాకు. కానీ డాక్టర్‌గా నువ్వుచెయ్యాల్సిన పని ఇంకోటి వుంది. ఈ డాక్టర్‌మీదా,ఈ స్కానింగ్ సెంటర్‌మీదా మెడికల్ కౌన్సిల్‌కి వెంటనే రిపోర్టియ్యి" అంది.

అజిత చేతుల్ని తన చేతుల్లో తీసుకుంది మాధవి.ఇద్దరూ కలిసి బైటికినడిచారు. ◇◇